సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 15 । జూన్ । 2025

గరిష్టం/కనిష్టం
33.0/27.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

'కాకా' మా రియల్ హీరో


కాకాతో వినోద్, వివేక్(ఫైల్)

చెన్నైల: మా నాన్న గడ్డం వెంకటస్వామి(కాకా) మా కుటుంబానికి రియల్ హీరో. ఆయన పెద్ద కొడుకుగా పుట్టడం నా అదృష్టం. తమ్ముడు వివేక్‌తోపాటు సోదరీమణులకు ఇంత చక్కటి జీవితాలను ఇచ్చినందుకు ఆయనకు ఎల్లకాలం రుణపడి ఉంటాం. వివేక్‌కు, నాకు ప్రస్తుతం సమాజంలో లభిస్తున్న గౌరవం, మర్యాదల క్రెడిట్ మొత్తం మా నాన్నగారికే పోతుంది. చిన్ననాడు నడక నేర్పిన నాటి నుంచి పాఠశాల, కళాశాల విద్య ఆయన మార్గనిర్దేశంలోనే కొనసాగాయి. నాన్న ఆశీర్వాదంతోనే రాజకీయాల్లోకి రాగలిగాను. ఎస్‌సీపీ ప్రెసిడెంట్‌గా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా సేవలు అందించగలిగాను. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వెంకటస్వామి చేసిన కృషి అందరికీ తెలుసు. ఆయన చివరి శ్వాస వరకు నిరుపేదల అభ్యున్నతి కోసం తాపత్రయ పడిన వ్యక్తి. కాకా సూచన మేరకు డాక్టర్ అంబేద్కర్ పేరిట యూనివర్సిటీ ఏర్పాటు చేసి 1.50లక్షల మందికి ఉన్నత చదువులు అందించగలిగాం. ఫాదర్స్‌డే సందర్భంగా నాన్నగారిని స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు అవిశ్రాంతంగా కృషి చేస్తాను. అందరికీ ఫాదర్స్‌డే శుభాకాంక్షలు.

– గడ్డం వినోద్, బెల్లంపల్లి ఎమ్మెల్యే

నాన్నే.. రోల్‌మోడల్..



నిర్మల్: మానాన్న బీఎస్.సర్కార్. జార్ఖండ్ కేడర్ రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్. మేం నలుగురం పిల్లలం. ఇద్దరు అక్కచెల్లెళ్లం. ఇద్దరు అన్నదమ్ములు. మా అందరినీ నాన్న బాగా చదివించారు. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా మా గురించి ప్రతిరోజు ఆలోచించేవారు. అందుకు తగ్గట్లు గానే ఈరోజు అందరం ఉన్నత స్థాయిలో స్థిరపడ్డాం. న్యాయశాస్త్రంలో మాస్టర్స్ చదివిన నాన్న మమ్మల్ని కూడా చదువులో ప్రోత్సహించారు. అందుకే పబ్లిక్ పాలసీలో డబుల్ మాస్టర్స్, సోషియాలజీలో మాస్టర్స్ చదివాను. సివిల్స్ లక్ష్యంగా పెట్టుకోవాలని నాన్నే నాకు సూచించారు. ఐఏఎస్ సాధించడంలోనూ నాన్న అడుగడుగునా వెన్నుతట్టి ప్రోత్సహించారు. నా విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇప్పటికీ చాలా విషయాల్లో నాన్నే రోల్‌మోడల్.

– అభిలాష అభినవ్, కలెక్టర్, నిర్మల్

నా విజయంలో మా నన్న

Happy Fathers day

- గమ్యం నిర్దేశించి.. దిక్సూచిగా నిలిచి
- లక్ష్యసాధనలో ఆ త్యాగం అనిర్వచనీయం
- నేడు అంతర్జాతీయ తండ్రుల దినోత్సవం

నాన్న.. రెండక్షరాల పదమే అయినా ప్రతీ ఒక్కరి జీవితంలో విడదీయరాని బంధం. బాల్యంలో వేలుపట్టి నడక నేర్పే తొలిగురువుగా.. తప్పటడుగులు సరిదిద్దే మార్గదర్శిగా.. లక్ష్యసాధనలో దిక్సూచిగా నిలిచే ఆ స్ఫూర్తి ప్రదాత పాత్ర అనిర్వచనీయం. కనుపాపలను తీర్చిదిద్దే ఆ కనురెప్పల మాటున కనిపించని త్యాగాలెన్నో. బిడ్డల విజయ తీరాన అది ఆనంద బాష్పమై వికసిస్తోంది. జీవిత పయనంలో బాధలెన్ని ఎదురైనా పిల్లల వికాసానికి బాటలు వేసే ఆ అలుపెరగని బాటసారికి సలాం చేయాల్సిందే. తాను సాధించని విజయాలను వారి రూపంలో చూసుకుని మురిసిపోయే ఆ ప్రేక్షకుడికి నీరాజనం పలకాల్సిందే. ఉన్నతస్థాయికి ఎదిగిన తమ విజయంలో ఆయనదే అగ్రస్థానమంటున్నారు ఆ బిడ్డలు. నేడు ఫాదర్స్ డే సందర్భంగా తమ సక్సెస్‌లో నాన్న పాత్రపై పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే.. – కైలాస్‌నగర్

జీవిత గమ్యాన్ని నిర్దేశించారు


తల్లిదండ్రులతో యువరాజ్ మర్మాట్

మాది రాజస్థాన్‌లోని సవాయి మాదాపూర్ జిల్లా మలర్నా చౌర్ గిరిజన గ్రామం. నాన్న సీతారాం మీనా. డీపీఆర్వోగా పనిచేశారు. 1నుంచి 7వరకు హిందీ మీడియంలో, 8 నుంచి 12వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో చదివాను. బీహెచ్‌యూలో ఐఐటీ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. నాన్న నాకు బాల్యం నుంచే క్రమశిక్షణతో కూడిన జీవిత గమ్యాన్ని నిర్దేశించారు. ఆ దిశగా ప్రోత్సహించారు. ఐఐటీ అనంతరం సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో ఇంట్లో కొంత ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ విషయాన్ని నాకు తెలియనివ్వకుండా చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత ఉద్యోగంతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని చెప్పేవారు. ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేసేవారు. సివిల్స్‌లో ఐదు సార్లు నిరాశ ఎదురైనా లక్ష్యాన్ని చేరుకునే దిశగా మరింత కష్టపడాలని వెన్నుతట్టారు. ఆ ప్రోత్సాహంతోనే ఆరో ప్రయత్నంలో 458వ ర్యాంకు సాధించాను. ఐఏఎస్‌గా ఎంపికయ్యా. నా జీవిత లక్ష్యాన్ని చేరుకోవడంలో మా నాన్నే నాకు రోల్‌మోడల్.

– యువరాజ్ మర్మాట్, సబ్‌కలెక్టర్, ఉట్నూర్

– మరిన్ని కథనాలు 8లో ▸

తల్లిదండ్రులతో శుభం రేకుల్వర్



ఐదు సార్లు విఫలమైనా వెన్నుతట్టారు

మాది ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్ గ్రామం. నాన్న సత్యనారాయణ జర్నలిస్టు. చిన్నప్పటి నుంచి ఆయనే నాకు స్ఫూర్తి. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన నేను ఐఆర్‌ఎస్‌గా ఎంపికయ్యానంటే అది నాన్న అందించిన ప్రోత్సాహమే. చదువు ప్రాధాన్యతతో పాటు ఎన్నికష్టాలు ఎదురైనా లక్ష్యసాధనను మాత్రం వీడొద్దని ఆయన నుంచే నేర్చుకున్నా. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇంద్రవెల్లిలో చదివాను. 6నుంచి 10 వరకు కాగజ్‌నగర్ జవహర్ నవోదయలో, ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లో పూర్తిచేశా. ఐఐటీ గౌహతిలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాక సివిల్స్‌కు సన్నద్ధమయ్యాను. తొలి ప్రయత్నంలో 12 మార్కులతో వెనుకబడ్డాను. రెండో ప్రయత్నంలో మెయిన్స్ కూడా రాలేదు. ఇలా ఐదు ప్రయత్నాల్లో నిరాశే ఎదురైంది. ఆరో ప్రయత్నంలో ఢిల్లీలో కోచింగ్ తీసుకునే క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. అయినా నా చదువు, భవిష్యత్తు విషయంలో నాన్న ఎప్పుడూ రాజీ పడలేదు. అనునిత్యం నాలో ఆత్మవిశ్వాసం నింపుతూ ప్రోత్సహించారు. పరీక్షలు రాసే సమయంలో భోజనం కూడా చేయకుండా ఓపికగా సెంటర్ వద్దే బయట వేచి ఉండేవారు. ఆరో ప్రయత్నంలో 790వ ర్యాంకు సాధించాను. ప్రస్తుతం నాగ్‌పూర్‌లోని ఐఆర్‌ఎస్ శిక్షణ సంస్థలో ఇన్‌కంటాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా శిక్షణ పొందుతున్నా. ఇది ముమ్మాటికీ మా నాన్న అందించిన విజయమే.

– శుభం రేకుల్వర్, ఐఆర్‌ఎస్

అనుక్షణం అండగా నిలిచారు..


సాయిచైతన్య, గోవింద్‌రావును సన్మానిస్తున్న అదనపు డీజీ(ఫైల్)

మాది తలమడుగు మండలంలోని గిరిజన గ్రామమైన పల్సి(బి)తండా. నాన్న జాదవ్ గోవింద్ రావు హెడ్ కానిస్టేబుల్. మా ఊరిలో తొలి ప్రభుత్వ ఉద్యోగి నాన్నే. చదువుతోనే గొప్ప భవిష్యత్తు ఉంటుందని నమ్మిన వ్యక్తి. చిన్నతనం నుంచే నాకు విద్యా ప్రాధాన్యతను వివరించారు. ఒకటి నుంచి ఐదు వరకు ఉట్నూర్‌లో, ఆరు నుంచి పదో తరగతి వరకు కాగజ్‌నగర్ నవోదయలో చదివాను. ఇంటర్ హైదరాబాద్‌లో, తిరుచ్చి ఐఐటీలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను. నాన్న పోలీస్ శాఖలో పనిచేస్తుండటంతో జిల్లాకు వచ్చిన ఎస్పీ, కలెక్టర్ల గొప్పతనం, వారికి సమాజంలో ఉండే గౌరవం గురించి చెప్పేవారు. ఆ దిశగా లక్ష్యాన్ని ఎంచుకోవాలని సూచించేవారు. దీంతో బీటెక్ పూర్తికాగానే ఐఏఎస్ సాధించాలని నిర్ణయించుకున్నాను. తొలి నాలుగు ప్రయత్నాల్లో విఫలమయ్యాను. ఐదో ప్రయత్నంలో ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికైనా అందులో చేరలేదు. 2024లో 68వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌గా ఎంపికయ్యాను. ప్రస్తుతం ముస్సోరిలో శిక్షణలో ఉన్నా. పోలీస్ ఉద్యోగమంటే సెలవులుండేవి కావు. కానీ నేను పరీక్షలు రాసే సమయంలో నాన్న నా వెంటే ఉండేవారు. లక్ష్యాన్ని చేరుకునే దిశగా అనుక్షణం నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఆయన పడిన కష్టం, అందించిన మార్గదర్శనంతోనే నేను విజయం సాధించగలిగాను.

– జాదవ్ సాయి చైతన్య, ఐఏఎస్

న్యూస్‌రీల్

నీట్‌లో 'ఎస్ఆర్' ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న జోనల్ ఇన్‌చార్జి

ఆదిలాబాద్‌టౌన్: నీట్ ఫలితాల్లో జిల్లాకేంద్రంలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. 720 మార్కులకు గానూ దొతే అనీష్ 463 మార్కులు, జాదవ్ అన్విక 427, పోడటి అను 391, పేర్కా సంజన 378, బి.అక్షితకు 345,వి.దివ్య 325, వి.సాయితేజ 305 మార్కులతో అర్హత సాధించారు. కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇందులో జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు జైపాల్‌రెడ్డి, అరవింద్, లలిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో సూచించారు. సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను అవలంబిస్తూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారని పేర్కొన్నారు. అప్రమత్తతతోనే వాటిని అరికట్టవచ్చని తెలిపారు. బాధితులు నేరం జరిగిన వెంటనే 1930 నంబర్‌కు, సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. గోల్డెన్ అవర్ (గంట) లోపు సంప్రదించినట్లయితే ఎక్కువ మొత్తం డబ్బులు పోకుండా బ్యాంకుల్లో హోల్డ్ చేసి వాటిని తిరిగి అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.జిల్లాలో గతవారం ఐదు సైబర్ క్రైమ్ ఫిర్యాదులు అందాయని వివరించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కైలాస్‌నగర్: గత ప్రభుత్వ హయంలో సుందరీకరించిన పట్టణంలోని ప్రధాన కూడళ్లను కూల్చివేయడంపై మాజీ మంత్రి జోగు రామన్న అభ్యంతరం వ్యక్తంచేశారు. కలెక్టర్ రాజర్షి షాను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. టెక్నికల్ రోడ్ సేఫ్టీ కమిటీ ప్రతిపాదనలా లేక ఏదైనా ప్రభుత్వ శాఖల ఆదేశాల మేరకు కూడళ్లను కుదిస్తున్నారో స్పష్టత ఇవ్వాలని కోరారు. కూల్చివేతల ద్వారా ప్రజాధనం వృథా అవుతుందని తెలిపారు. దీనిపై కమిటీ ఏర్పాటు చేసి చర్యలుతీసుకోవాలని కోరారు.

సలహాలిచ్చి.. చైతన్యపరిచి


రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు (ఫైల్)

- రైతులతో నేరుగా సమావేశాలు
- వానాకాలం సాగుపై సందేహాల నివృత్తి
- ఆరు వారాల పాటు అవగాహన కార్యక్రమాలు
- ముగిసిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

జిల్లాలో..
నిర్వహించిన అవగాహన సదస్సులు : 52
పాల్గొన్న రైతులు : 2,600

ఆదిలాబాద్‌అర్బన్: అన్ని రంగాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న వ్యవసాయ రంగం మాత్రం ఆ దిశగా ముందుకు సాగడం లేదు. ఇందుకు కారణం సాగుపై రైతులకు అవగాహన లేకపోవడమేనని భావించిన రాష్ట్ర ప్రభుత్వం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా వానాకాలం సాగుకు ముందే అన్నదాతలను సంసిద్ధం చేయాలనే ఆలోచనతో శాస్త్రవేత్తల బృందాలను నేరుగా గ్రామాలకు పంపించి అవగాహన సదస్సులు నిర్వహించేలా ప్రభుత్వం ఏర్పా ట్లు చేసింది. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం మే 5న ప్రారంభం కాగా, శుక్రవారంతో ముగిసింది.

రైతులతో నేరుగా..

కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని రైతులతో నేరుగా శాస్త్రవేత్తలు చర్చలు జరిపారు. వ్యవసాయ అధికారులతో పాటు కృషి విజ్ఞానకేంద్రం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సంయుక్తంగా రెండేసి బృందాలుగా ఏర్పడి రోజుకో గ్రామాన్ని సందర్శిస్తూ రైతులతో సమావేశమయ్యారు. సాగుపై సలహాలు, సూచనలు ఇస్తూ, వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. రైతుల చెప్పిన విషయాలను సైతం నమోదు చేసుకున్నారు. రసాయన ఎరువులు మోతాదులోవినియోగించడం, పంటలమార్పిడి, పత్తి, సోయా, మొక్కజొన్న, జొన్న తదితర పంటల వ్యర్థాలను పొలాల్లో కాల్చకుండా ఏ విధంగా తీసివేయాలనే దానిపై అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు సమయంలో ఏ అంశాలు పరిశీలించాలి.. కొన్న తర్వాత రశీదు, ప్యాకెట్లను భద్రపర్చుకోవడం, పొలంగట్లపై మొక్కలు నాటడం, తదితర విషయాలను వివరించారు. ప్రధానంగా యూరియా అధిక వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. నేల సారవంతం, పర్యావరణం, మానవ ఆరోగ్యంపై చూపే ప్రతికూల ప్రభావాలను వివరించారు. ఈ సమావేశాలు జిల్లాలో ఆరు వారాల పాటు కొనసాగాయి.

తక్కువ మోతాదులో వాడాలి

సాగులో రసాయన ఎరువుల మోతాదు తగ్గించుకుంటే పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుంది. ప్రధానంగా యూరియాను ఎక్కువ వినియోగించొద్దు. పంట మార్పిడి పద్ధతితో సుస్థిర ఆదాయం పొందవచ్చు. విత్తనాల కొనుగోలులో తప్పకుండా జాగ్రత్తలు పాటించాలి. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించాం.

– డాక్టర్ రాంప్రసాద్, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన కేంద్రం

రాజీమార్గమే రాచమార్గం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

- జిల్లా జడ్జి ప్రభాకర రావు

ఆదిలాబాద్‌టౌన్: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు అన్నారు. జిల్లాకేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. బీమా, యాక్సిడెంట్ తదితర రాజీ పడదగిన పలు కేసులను పరిష్కరించారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకున్న కక్షిదారులకు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతీ మూడు నెలలకోసారి జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు, బీమా కంపెనీలు, న్యాయవాదుల సహకారంతో అత్యధికంగా కేసులను రాజీ మార్గంలో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నపాటి కేసుల్లో కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్జిలు శివరాంప్రసాద్, రాజ్యలక్ష్మి, వివేక్, లక్ష్మి, హుస్సేన్, ఏఎస్పీ సురేందర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేశ్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

12,490 కేసులు పరిష్కారం

జిల్లాలోని వివిధ కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 12,490 కేసులు పరిష్కారమైనట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో 2,944 క్రిమినల్, 19 సివిల్, 9527 ప్రిలిటిగేషన్ కేసులున్నాయి. కేసుల పరిష్కారంలో రాష్ట్రస్థాయిలో జిల్లా 22వ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

బాధితులకు కలెక్టర్ పరామర్శ

- రిమ్స్‌లో అపరిశుభ్రతపై అసహనం
- వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం


బాధితుడిని పరామర్శిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌టౌన్: పిడుగుపాటుకు గురై రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితులను కలెక్టర్ రాజర్షి షా శనివారం పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకుని వారి ఆరోగ్య స్థితిగతులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యమందించి త్వరగా కొలుకునేలా చూడాలన్నారు. అనంతరం ఎమర్జెన్సీ వార్డులోని మరుగుదొడ్లను పరిశీలించారు. అక్కడ అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సమయానికి వస్తున్నారా లేదా అని సిబ్బందిని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


రక్తదానానికి ముందుకు రావాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం అన్ని దానాల కంటే గొప్పదన్నారు. అనంతరం రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్,ఆర్ఎంవో సాయి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'రైతు నేస్తం'కు పకడ్బందీ ఏర్పాట్లు

కైలాస్‌నగర్: ఈనెల 16నుంచి నిర్వహించనున్న రైతు నేస్తం కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా వ్యవసాయాధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణపై సంబంధిత అధికారులతో శనివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంనుంచి సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి ద్వారా మాట్లాడతార ని, ఈ కార్యక్రమాన్ని అన్ని రైతునేస్తం కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో రైతులు వ్యవసాయనిపుణులతో మాట్లాడి తమ సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటివరకు 17కేంద్రాల్లో ఉన్న వీడి యో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని మరో 32 కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్‌కలెక్టర్ యువరాజ్, ఆర్డీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నడిపించే దైవం నాన్న



• ప్రేమ, బాధ్యతలకు ప్రతిరూపం • పిల్లల భవిష్యత్‌కు మార్గదర్శి
• అందరికీ నాన్నే రోల్ మోడల్ • నేడు ఫాదర్స్‌డే

'నాన్న అంటే త్యాగం.. నాన్న అంటే ప్రేమతో కూడిన బాధ్యత.. నాన్న అంటే ఎత్తైన శిఖరం.. తన రెక్కలు ముక్కలు చేసుకుని రేయి, పగలు కష్టపడి కుటుంబానికి కవచంగా నిలిచేవాడు.. తాను ఓడిపోయి పిల్లలను గెలిపించే త్యాగశీలి.. కనిపించే దేవత అమ్మ అయితే.. నడిపించే దేవుడు నాన్న.. ఇలా నాన్న గురించి ఎత్త చెప్పినా తక్కువే.. ఫాదర్స్ డే సందర్భంగా తండ్రి ప్రోత్సాహంతో సమాజంతో ఉన్నత స్థానంలో నిలబడ్డ పలువురు వెలుబుచ్చిన అభిప్రాయాలు, సంఘటనలతో ప్రత్యేక కథనం..

నిత్యస్ఫూర్తి..



నిర్మల్: మా నాన్న నాళం సాయన్న అంటే.. ఫిజిక్స్ లెక్చరర్‌గా అందరికీ తెలుసు. జూనియర్ లెక్చరర్‌గా సేవలందించి, ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. విధినిర్వహణలో ఎంత బిజీగా ఉన్నా.. మా గురించి రోజూ ఆలోచించేవారు. తన తపనకు తగ్గట్లుగా మంచి స్థానాల్లో స్థిరపడ్డాం. నన్ను డాక్టర్‌ను చేసిన నాన్న ఇప్పటికీ ఆస్పత్రిలో నిత్యం సహకరిస్తున్నారు. నేను నా పిల్లలతో ఎలా ఉండాలోనన్న నిత్య స్ఫూర్తినిస్తున్నారు.

– నాళం శశికాంత్, జనరల్ సర్జన్, నిర్మల్

నాన్న స్ఫూర్తితోనే..



నిర్మల్: 'మెదడుకు పదును' అంటూ చిన్నప్పుడు నాన్న నాకిడి గంగన్న మాకు అందుబాటులో ఉంచిన పుస్తకాలు, తను చెప్పిన మాటలే ఇవ్వాళ ఐఆర్‌ఎస్ అధికారిని చేశాయి. రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా నాన్న అడ్మినిస్ట్రేషన్‌ను దగ్గరుండి చూశాను. అంత బిజీగా ఉంటున్నా.. నాన్న మా గురించి నిత్యం ఆలోచించేవారు. తన స్ఫూర్తితోనే సివిల్స్‌లో ఆలిండియా 293ర్యాంక్ సాధించగలిగాను. ప్రస్తుతం గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కస్టమ్స్ అండ్ సీజీఎస్‌టీ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్నాను. నేను ఎక్కడ ఉన్నా.. నాన్న ఆదర్శాలు నిత్యం నన్ను నడిపిస్తూనే ఉంటాయి.

– నాకిడి సృజన్, అడిషనల్ కమిషనర్, కస్టమ్స్ అండ్ సీజీఎస్‌టీ, గుజరాత్

పెద్దగా చదువుకోకపోయినా..



అమ్మానాన్నలతో శ్రీనివాస్, వినోద్

సాత్నాల: భోరజ్ మండలం ఆకోలి గ్రామానికి చెందిన మునిగెల విఠల్ సాధారణ రైతు కుటుంబంలో జన్మించాడు. ఇంటర్ వరకు విద్యనభ్యసించాడు. తనకున్న బరువు, బాధ్యతలతో పైచదువులు కొనసాగించలేకపోయాడు. ఇద్దరు కుమారుల్లో పెద్దవాడు శ్రీనివాస్, రెండోవాడు వినోద్ పిల్లలు ఉన్నత స్థానాల్లో చూడాలని తపించేవాడు. వారిని ప్రోత్సహించేవాడు. నాన్న కలను నెరవేర్చుతూ శ్రీనివాస్ జూనియర్ లెక్చరర్, వినోద్ డాక్టర్ అయ్యారు.

ప్రోత్సాహం వెలకట్టలేనిది



మా నాన్న బాల్యం నుంచే చదువు ప్రాముఖ్యత, మంచి తనం, మానవత్వం, విలువల గురించి మాకు నేర్పించారు. ఆయన ప్రోత్సాహంతోనే లెక్చరర్ ఉద్యోగం సాధించి ప్రస్తుతం ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్నాను. నాన్న ప్రోత్సాహం వెలకట్టలేనిది. ఎన్ని జన్మలెత్తినా ఆయనకే కొడుకుగా పుట్టాలని కోరుకుంటున్న.

– మునిగల శ్రీనివాస్, జూనియర్ లెక్చరర్

నాన్న చూపిన బాటలో నడుస్తా



మనం చదువుకున్న చదువు పదిమందికి ఉపయోగపడాలనేది నాన్న ఆశయం. ఆయన చూపిన మార్గంలోనే కష్టపడి డాక్టరేట్ సాధించాను. పేద ప్రజలు, గ్రామస్తులకు ఉచిత వైద్యమందించాలనేది నాన్న కల. నాన్న చూపిన మార్గంలో నడుస్తూ చేతనైనంత సాయం చేస్తూనే ఉంటాను. ప్రస్తుతం ఈ ఎస్‌ఐ రామచంద్రపురంలో పని చేస్తున్న.

– డాక్టర్ వినోద్, ఎండీ జనరల్ మెడిసిన్

ఆయన కష్టఫలమే..



నిర్మల్: మేము ముగ్గురు అన్నదమ్ములం. ముగ్గురు అక్కలు. ఆరుగురు సంతానాన్ని నాన్న కుంట భూమన్న తన రెక్కల కష్టంతోనే పోషించారు. నిర్మల్ బస్టాండ్‌లో హమాలీగా పనిచేస్తూ.. మూటలు మోస్తూ.. మా అందరినీ బాగా చదివించారు. మా కోసం నాన్న పడ్డ కష్టం మరచిపోలేం. అందరం మంచి స్థాయిలో స్థిరపడ్డాం. 81 ఏళ్ల వయసులో నాన్న ఇప్పటికీ తన పనులు తానే చేసుకుంటూ మాకు నిత్యం ఆదర్శంగా నిలుస్తున్నారు.

– డాక్టర్ రమణేశ్వర్, న్యూరోసర్జన్, నిర్మల్

పిల్లల కోసమే ప్రమోషన్ వదిలి..



కొడుకులతో అర్క పోచయ్య

వేమనపల్లి: మండలంలోని బుయ్యారం గ్రామానికి చెందిన అర్క పోచయ్య పిల్లల బాగోగుల కోసం ఉద్యోగ రీత్యా ప్రమోషన్ వదులుకుని వారి జీవితాలను తీర్చిదిద్దాడు. తన తండ్రి గంగయ్య గ్రామంలో భూస్వాములకు పాలేరుగా ఉండి పోచయ్యను 10 వతరగతి వరకు చదివించాడు. మంచిర్యాలలో డిగ్రీ, ఆ తర్వాత ఎంబీఏ పూర్తి చేశాడు. ఎల్‌ఐసీలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన పోచయ్య ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. మేనేజర్‌గా ప్రమోషన్ వచ్చినా కొడుకుల చదువులకు ఆటంకమేర్పడుతుందని వదులుకున్నాడు. ఉద్యోగరీత్యా మంచిర్యాలలో ఉంటున్నాడు. పెద్ద కొడుకు మనోజ్ గాంధీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి మల్లారెడ్డి మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్నాడు. రెండో కొడుకు మహర్షి బీటెక్ 'సివిల్' పూర్తి చేసి అల్ట్రాటెక్ కంపెనీలో పని చేస్తున్నాడు. మనీశ్ బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తిచేసి ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు.

నాన్న కష్టానికి ఫలితంగా డాక్టర్లమయ్యాం



అమ్మానాన్నలతో ప్రీతమ్ కుమార్, అశ్వీత

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలకు చెందిన చిరువ్యాపారి సిద్దంశెట్టి ప్రవీణ్, మధుశ్రీ దంపతులకు కుమారుడు ప్రీతమ్, కుమార్తె అశ్వీత సంతానం. తన పిల్లల భవిష్యత్ కోసం ఎన్నో కష్టాలు పడ్డాడు. చేసేది చిరువ్యాపారమైనా ఇద్దరు పిల్లలను వైద్యులను చేశాడు. తండ్రి ఆశలకు అనుగుణంగా కుమారుడు ప్రీతమ్‌కుమార్ యూకేలో పీజీ సర్జన్ చేస్తుండగా.. కుమార్తె అశ్వీత ఎంజీఎంలో హౌజ్ సర్జన్‌గా చేస్తోంది. తమ భవిష్యత్ కోసం నాన్న పడిన శ్రమ.. ఆర్థిక కష్టాలు, అన్నీఇన్నీ కావంటున్నారు సిద్దం శెట్టి ఆశ్వీత. 'నాన్న చదువులో ఎంతో ప్రోత్సహించేవారు. అన్నయ్య ప్రీతమ్‌తో సమానంగా నన్ను చదివించారు. లోనవెల్లి గ్రామంలో మా నాన్నమ్మకు వైద్యం అందక పడిన ఇబ్బందులు కళ్లారా చూశాం. అప్పుడే డాక్టర్లం అవుతామని నాన్నకు చెప్పాం. ఇంట్లో ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డం వస్తాయని అనుకున్నప్పటికీ నాన్న వెన్నంటి ప్రోత్సహించారు. నాన్న కల నిజం చేసి అన్నయ్య, నేను డాక్టర్లయ్యాం' అని ఆశ్వీత గర్వంగా చెబుతున్నారు.

నాన్న కష్టమే ఎస్సైని చేసింది



తండ్రి తిరుపతితో ఎస్సై అనూష

జన్నారం: నాన్నంటే నడిపించే దైవమంటున్నారు జన్నారం ఎస్సై గొల్లపెల్లి అనూష. 'కరీంనగర్ జిల్లా వెల్గటూర్ మండలం రాజారాంపల్లె గ్రామానికి చెందిన గొల్లపెల్లి తిరుపతి, పుష్పలత దంపతులకు మేము నలుగురు ఆడపిల్లలం. మాది మధ్య తరగతి కుటుంబం. ఆడపిల్లలమని అధైర్య పడకుండా నాన్న నలుగురిని చదివించారు. అందరూ డిగ్రీ పూర్తి చేయగా నేను మాత్రం బీటెక్ పూర్తి చేశాను. మా అందరికీ వివాహాలు, కాన్పులు చేశారు. నేను కష్టపడి ఎస్సై ఉద్యోగం సాధించాను. నాన్న కష్టపడి చదివించడంతోనే నేను ప్రయోజకురాలిగా ఈ రోజు ఉద్యోగం చేస్తున్నాను. మమ్ములను చదివించేందుకు నాన్న దుబాయ్ వెళ్లేవారు. మాకు వివాహాలు చేసిన తర్వాత కూడా అప్పులు తీర్చడం కోసం ఇంకా దుబాయ్ వెళ్తూనే ఉన్నారు. రెండేళ్లకోసారి మా కోసం ఇక్కడికి వస్తూ తిరిగి వెళ్తుంటారు. ఆయన కష్టమే మమ్ములను ప్రయోజకులుగా చేసింది' అంటున్నారు అనూష.

నాన్న రెక్కల కష్టం.. కూతుళ్ల చదువులకే..



తల్లిదండ్రులతో మధుమిత, మనస్విత

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన చింతల పురుషోత్తం–మమత దంపతులకు ఇద్దరు కూతుళ్లు మధుమిత, మనస్విత సంతానం. పురుషోత్తం తనకున్న ఎకరంలో వ్యవసాయం చేస్తూ, గొర్రెలు కాస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. కుటుంబం గడవడానికి, ఇద్దరు ఆడపిల్లలను ప్రయోజకులుగా చేయడానికి చాలా కష్టపడి చదివించాడు. తను కష్టపడి సంపాదించిన మొత్తాన్నంతా పిల్లల చదువుకే ఖర్చు చేస్తున్నాడు. పెద్ద కూతురు మధుమిత ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తి చేసి ప్రస్తుతం బ్యాంక్ ఉద్యోగాల కోసం నంద్యాలలో కోచింగ్ తీసుకుంటోంది. చిన్న కుమార్తె మనస్విత ఎలాంటి కోచింగ్ లేకుండా మూడేళ్ల క్రితం 2వేల ర్యాంక్ సాధించి మద్రాస్ ఐఐటీలో సీఎస్‌ఈ విభాగంలో సీటు సాధించి ప్రస్తుతం మూడో సంవత్సరం చదువుతోంది. పేద కుటుంబమైనప్పటికీ ఇద్దరు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్న పురుషోత్తం నాన్నలందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

నాన్న.. సేవ..

• తండ్రి యాదిలో చారిటబుల్ ట్రస్టులు
• సామాజిక కార్యక్రమాలతో ముందుకు..



రక్తదాన శిబిరంలో శ్రీపతి (ఫైల్)



క్రీడాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న దుర్గం రాజేశ్ (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలకు చెందిన మల్యాల శ్రీపతి తండ్రి రాజయ్య 2007లో చనిపోయాడు. ఆయన జ్ఞాపకార్థం సేవ చేయాలని శ్రీపతి ఆలోచించాడు. ఓసారి తన స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి రక్తం అవసరం కావడంతో దానం చేశాడు. ఆ తర్వాత 2013లో తండ్రి పేరిట మల్యాల రాజయ్య వెల్ఫేర్ సొసైటీ, 2024లో మల్యాల చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి రక్తదానం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఇప్పటివరకు 55 సార్లు రక్తదానం చేశాడు. రక్తం అవసరమని ఎవరైనా అడిగిన వెంటనే ట్రస్టు ద్వారా సమకూరుస్తుంటారు. మహిళలు ముందుకు రావాలనే ఉద్దేశంతో తన సతీమణి సుష్మతో ఆరు సార్లు రక్తదానం చేయించాడు. పట్టణానికి చెందిన దివ్యాంగుడు, మరో ఇద్దరు వృద్ధురాళ్లకు ప్రతీ మూడు నెలలకోసారి 25కిలోల బియ్యం అందిస్తున్నాడు.

• దుర్గం రాజేశ్ తన తండ్రి పేరిట దుర్గం పోచం చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలందిస్తున్నాడు. పాత మంచిర్యాలకు చెందిన దుర్గం పోచం కౌన్సిలర్‌గా పని చేస్తూ చనిపోయాడు. 2020లో దుర్గం పోచం చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశాడు. స్కూల్ పిల్లలకు యూనిఫాం, అనాథాశ్రమానికి బియ్యం అందజేశాడు. సరస్వతీ శిశుమందిర్‌లో ఓ పేద విద్యార్థికి ఏడాది పాటు ఫీజు చెల్లించాడు. రాళ్లపేట్ రోడ్ నంబర్–1లో శివపంచాయతన ఆలయానికి తన తండ్రి పేరిట స్థలాన్ని అప్పగించి ఆదర్శంగా నిలిచాడు. పేదల కుటుంబాల్లో వివాహాలకు ఆర్థికసాయం, కళాకారులు, క్రీడాకారులకు పోటీల సమయంలో ఆర్థికసాయం, బహుమతులు అందజేస్తున్నాడు.

నాన్నే నాకు హీరో..



తల్లిదండ్రులతో అఖిల్‌రెడ్డి

జైనథ్: 'మాది జైనథ్ మండలంలోని కూర గ్రామం. మాది వ్యవసాయ కుటుంబం. చిన్నప్పటి నుంచి మా నాన్న అల్లూరి నర్సింగ్‌రెడ్డి నన్ను, మా చెల్లె రిచాను ఎంతో కష్టపడి చదివించారు. ఎంత కష్టం వచ్చినా వ్యవసాయం మానుకోలేదు. అహర్నిశలు శ్రమిస్తూ మమ్మల్ని ఉన్నత చదువులు చదివించారు. సాధారణ రైతు అయినప్పటికీ చదువు విలువ తెలిసి ఆయన నాకు చదువు ప్రాముఖ్యత తెలియజేస్తూ ప్రోత్సహించాడు. నేను ప్రభుత్వ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. 2021లో కానిస్టేబుల్ ఉద్యోగం మూడు మార్కుల తేడాతో చేజారినప్పటికీ కుంగిపోలేదు. నాన్న ఇచ్చిన ధైర్యంతో 2023లో మరోసారి ప్రయత్నించి సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం భీంపూర్ మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాను. మమ్మల్ని ఇంతటివారిని చేసిన నాన్నే నాకు హీరో..' అంటున్నాడు అఖిల్‌రెడ్డి

'నీట్'లో ట్రినిటి ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్: నీట్–2025 ఫలితాల్లో ట్రినిటి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. అనేకమంది అత్యుత్తమ మార్కులు సాధించడంతో పాటు, కొందరు టాప్ 1000ర్యాంకుల్లో చోటు సాధించారు. బీ కార్తిక్ (519 మార్కులు), ఎం.మానస (504), ఎం.చంద్రశేఖర్ (501), వై.అశ్విత (488) ఎస్.గౌతమి(471), ఎం.శ్రీకాంత్(470), ఎం.శివప్రసాద్(469), ఎస్.అఖిల్ (469), ఎం.హరిశ్చంద్ర (463), ఎం.అభినయ (461మార్కులు) సాధించారు. బీ కార్తిక్ 736వ ర్యాంక్, ఎం.చంద్రశేఖర్ 1,266వ ర్యాంక్, ఎల్.ప్రతిమ 2,149వ ర్యాంక్, డీ తేజస్విని 2,267వ ర్యాంక్, జే అంజని 4212వ ర్యాంక్, కే మయూక 4,286వ ర్యాంకులతో జాతీయస్థాయిలో రాణించారు. ట్రినిటి వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యార్థుల పట్టుదల, ట్రినిటిలో అందించే శిక్షణ పద్ధతులు, మెరుగైన విద్యా వాతావరణం ఈ గొప్ప విజయానికి కారమన్నారు. ఈ విజయం ట్రినిటిని దేశంలోని అత్యుత్తమ మెడికల్ శిక్షణ సంస్థల్లో ఒకటిగా నిలబెట్టిందన్నారు.

'అల్ఫోర్స్' విద్యార్థులకు అభినందన



ర్యాంకులు సాధించిన విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): నీట్–2025 ఫలితాల్లో కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి అభినందించారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల అకుంఠిత దీక్ష, పట్టుదల, కృషి ఫలితంగానే ఇంతటి ఘనవిజయం సాధించినట్లు నరేందర్‌రెడ్డి వివరించారు.

పట్టుబట్టి.. కొలువు కొట్టాడు

• అసిస్టెంట్ కమాండెంట్‌గా అభినవ్‌వర్మ



అభినవ్‌వర్మ

దండేపల్లి: పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు మండలంలోని నెల్కి వెంకటాపూర్‌కు చెందిన పెట్టెం అభినవ్ వర్మ. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తండ్రి లచ్చన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు. అభినవ్‌వర్మ పదోతరగతి వరకు మంచిర్యాలలో, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో చదివాడు. ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ ఐఐటీ జోధాపూర్‌లో పూర్తిచేశాడు. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా గతంలో కంబైండ్ డిఫెన్స్ సర్వీస్‌లో ఉద్యోగం కోసం నాలుగుసార్లు ప్రయత్నించి విఫలమయ్యాడు. యూపీఎస్సీ నిర్వహించిన సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) ఉద్యోగానికి గతంలో ఒకసారి ప్రయత్నించి ఫెయిలయ్యాడు. అయినా ఏమాత్రం కుంగిపోకుండా పట్టువదలని విక్రమార్కుడిలా కష్టపడ్డాడు. మళ్లీ కసితో చదివాడు. గతేడాది నోటిఫికేషన్ విడుదల కాగా ఆగస్టులో నిర్వహించిన రాత పరీక్షలో ప్రతిభ కనబరిచి క్వాలిఫై అయ్యాడు. ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్, ఇంటర్వ్యూ అన్నింటా పాస్‌కావడంతో 138వ ర్యాంక్ సాధించి సీఏపీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా కుటుంబీకులు, బంధువులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, పలువురు అతడిని అభినందించారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

తలమడుగు: బావిలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం రవి (20) ఏడాదిగా మతిస్థిమితం కోల్పోయి ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ నెల 11న రాత్రి 9గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా బయటకు వెళ్లాడు. ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు అతడి కోసం వెతకగా ఆచూకీ లభించలేదు. శనివారం గ్రామ సమీపంలోని భువనగిరి గంగన్న వ్యవసాయ బావిలో మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకున్నారు. బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

ఏమాయికుంటలో బైక్ చోరీ

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామంలో బైక్ చోరీకి గురైంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఏమాయికుంట మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్ శుక్రవారం రాత్రి గ్రామ ప్రధాన రహదారి పక్కనే ఓ కిరాణాషాపు వద్ద బైక్ నిలిపి మండలకేంద్రంలోని తన బంధువులను కలిసేందుకు వెళ్లాడు. తిరిగి రాత్రి 11 గంటలకు రాగా బైక్ కనిపించలేదు. దీంతో శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో బైక్ చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు చూసి షేర్ చేసిన ఇద్దరిపై కేసు

ఇచ్చోడ: చైల్డ్ పోర్న్ వీడియోలు చూసి వాటిని సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. శనివారం సీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చైల్డ్‌పోర్న్ చూసి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఇచ్చోడకు చెందిన ఠాకూర్ సూర్యసింగ్, నేరడిగొండ మండలం కుమారి గ్రామానికి చెందిన పోతగంటి రాకేశ్‌పై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సైబర్ టీం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఇలాంటి చర్యలకు పాల్పడితే పోక్సో కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: మంచిర్యాల, రవీంద్రఖని రైల్వేస్టేషన్ల మధ్య ఈ నెల 13న రాత్రి గుర్తు తెలియని వ్యక్తి (35) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రైలు కిందపడి ఒకరు చనిపోయినట్లు అందిన సమాచారం మేరకు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు, అడ్రస్ లభించలేదని తెలిపారు. ఎడమ చేతిపై 'ఇండియా' అని ఇంగ్లిష్‌లో రాసిన పచ్చబొట్టు ఉందని, మృతుడి ఒంటిపై బ్లూకలర్ టీషర్ట్, జీన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు 9701112343, 8328512176 నంబర్లలో సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ సూచించారు.

బాసర క్షేత్రంలో భక్తుల రద్దీ



అక్షరాభ్యాస మండపంలో చిన్నారులతో భక్తులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం సంకటచతుర్థి శుభ ముహూర్తం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారులతో అక్షరాభ్యాస మండపంలో అర్చకులతో అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు జరిపించారు. వివిధ ఆర్జిత సేవా టికెట్ల ద్వారా రూ.9,14,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

గంజాయి పట్టివేత

నస్పూర్: పట్టణ పరిధిలో గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి సీతారాంపల్లిరోడ్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో విద్యానగర్‌కు చెందిన నాదరి వంశీ వద్ద 99 గ్రాముల గంజాయి లభ్యమైంది. గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చౌడేశ్వరీ మాత ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణ శివారులోని చౌడేశ్వరీ మాత ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం గేట్లకు వేసిన తాళాలను పగులగొట్టి లోనికి చొరబడ్డ దొంగలు బీరువాలోని వస్తువులను చిందరవందర చేశారు. ఆలయ సిబ్బంది శనివారం ఉదయం ఆలయానికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి సామగ్రి చిందరవందరగా ఉండగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. దీంతో టూ టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిసరాలను తనిఖీ చేసి ఆధారాలు సేకరించారు. కాగా, ఓ ముక్కు పుడక కనిపించడం లేదని ఆలయ పూజారి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి చుక్కల దుప్పి మృతి



దుప్పి కళేబరంతో సిబ్బంది

దస్తురాబాద్: దాహార్తి తీర్చుకునేందుకు వచ్చిన చుక్కల దుప్పిని ఊర కుక్కలు తరమడంతో వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. ఎఫ్ఎస్వో కింగ్‌ఫిషర్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆకొండపేట గ్రామం అటవీ ప్రాంతానికి సమీపంలో ఉంది. అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతంలో గ్రాస్ ప్లాంటేషన్‌లో భాగంగా గడ్డి పెంచుతున్నారు. సమీపంలో చెరువు ఉండటంతో గ్రాస్ ప్లాంటేషన్ ప్రాంతానికి తరచూ వన్యప్రాణులు మేత, నీటి కోసం వస్తుంటాయి. ఈ క్రమంలో శనివారం ఇక్కడికి వచ్చిన చుక్కల దుప్పులను ఊర కుక్కలు తరిమాయి. ఈ క్రమంలో ఓ చుక్కల దుప్పి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో పడింది. స్థానికులు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు తాళ్ల సాయంతో దానిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పికి పశువైద్యాధికారులు చికిత్స అందించినా మృతి చెందింది. ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి అటవీ ప్రాంతంలో దానిని ఖననం చేశారు.